

## బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 13: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం ఆ సంఘం నాయకులు డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 50 శాతం ఉపాధ్యాయులు ఉండేలా బదిలీలు, పదోన్నతుల్లో కేటాయింపులు చేయాలన్నారు. కార్యక్రమంలో జీటీఏ జిల్లా అధ్యక్షుడు కె జాన్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మోతె చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు గాజుల రవీందర్, బాధ్యులు శ్రీనివాస్, లక్ష్మీపతి, అభిషేక్, ఫిరోజ్, స్వప్న పాల్గొన్నారు.

# 'ఈటల'కు బీజేపీ పగ్గాలు..?

● త్వరలో బాధ్యతలు అప్పగించే అవకాశం ● పోటీ ఉన్నా ఆయన వైపే అధిష్ఠానం మొగ్గు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

బీజేపీ అధిష్ఠానం రాష్ట్రంలో సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మల్కాజ్‌గిరి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను నియమించాలని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలిసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దూకుడుకు బ్రేక్ వేయడానికి ఈటల రాజేందర్ సరైన వ్యక్తి అనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ నేతలతో ఆయనకున్న విస్తృత సంబంధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న పట్టు ఆధారంగా ఆ పార్టీ నేతలను, శ్రేణులను బీజేపీలోకి ఆహ్వానించడానికి తోడ్పడతాయని అనుకుంటున్నట్లు తెలిసింది.

### అనుభవం, పరిచయాలు, ఉద్యమ నేపథ్యం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు, కులవృత్తి సంఘాలతో ఆయనకున్న పరిచయాలు, ఆయా వర్గాల నేతలను, కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీలోకి మళ్లించేందుకు దోహదపడతాయని అనుకుంటున్నారని సమాచారం. బీఆర్‌ఎస్‌లో మంత్రిగా ఉండడమే కాకుండా ఉద్యమ కాలం నుంచి బీజేపీలో చేరే వరకు బీఆర్‌ఎస్‌లో తెలంగాణలో ఏర్పడిన సంక్లిష్ట పరిస్థితులను చక్కదిద్దే బాధ్యతను నిర్వహించడంలో ఈటల కీలక పాత్ర వహించారు. ఆయనకు ఉన్న నేర్పు, సహనం, బీజేపీ మరింత బలపడడానికి దోహదపడుతుందని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నందున



వీరందరిని సమన్వయపరుస్తూ పార్టీని ముందుకు నడిపించడం అనుభవజ్ఞుడైన వ్యక్తి చేతులో ఉంటేనే బాగుంటుందని అనుకుంటున్నట్లు సమాచారం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి రాష్ట్ర నాయకత్వం అప్పగించడంతో ఆయా సామాజిక వర్గాల్లో సానుకూలత ఏర్పడుతుందని నాయకత్వం భావిస్తున్నట్లు తెలసింది.

ప్రస్తుతం ఎంపీలుగా గెలుపొందిన జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌కు కేంద్ర మంత్రి పదవులు లభించాయి. ఎంపీలు డీకే అరుణ, బి.రఘునందన్‌రావు రాష్ట్ర అధ్యక్ష పదవిని కోరుకుంటున్న వారిలో ఉన్నారు.

మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారని చెబుతున్నారు. ఎంపీలుగా ఉన్నవారికే ఈ పదవి అప్పగించే అవకాశముందని ప్రచారం జరుగుతున్నది. ఎంపీగా గెలుపొందడం, బీసీ సామాజికవర్గానికి చెందడం రాజేందర్‌కు కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి.

### త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం

ఈనెల 24న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. వారంరోజులపాటు ఈ సమావేశాలు జరుగనున్నందున సమావేశాలకు ముందుగానీ, తర్వాత గానీ ఈ నియామకం జరిగే అవకాశముందని తెలిసింది. జాతీయ అధ్యక్ష పదవి నియామకం జరిగిన వెంటనే వివిధ రాష్ట్రాల్లో అధ్యక్షుల మార్పు ఉంటుందని, అందులో భాగంగా తెలంగాణ అధ్యక్షుడిని మారుస్తారని అనుకుంటున్నారు.ఈటల రాజేందర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కితే ఆయన జిల్లా నుంచి ఈ పదవి దక్కించుకున్న వారిలో మూడో వ్యక్తి అవుతారు. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు, బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర అధ్యక్ష పదవిని నిర్వహించారు.

## కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్

భగత్‌నగర్, జూన్ 13: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎంపీ బండి సంజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామిజీ బండి సంజయ్‌కుమార్‌ను ఆశీర్వదించారు. ఉదయం11 గంట లకు నార్త్‌బ్లాక్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం బండి సంజయ్‌కుమార్‌కు సహచర కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు బండి సంజయ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. బండి సంజయ్ అధికారిక నివాసంలో పలువురు తెలంగాణ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్

## పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు

### చొప్పదండి ఎమ్మెల్యే వినూత్న కార్యక్రమం



కలెక్టర్ పమేలాసత్పతికి నోట్‌బుక్స్, పెన్నులను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

కరీంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలెక్టర్‌ను కోరారు. ఈనెల 5న ఆయన జన్మదినం సందర్భంగా ప్రజలు, అభిమానులు తనవద్దకు పుష్పగుచ్ఛాలు, శాలువలు తీసుకురావద్దని, పేద విద్యార్థులకు అందించేందుకు నోట్‌బుక్కులు, పెన్నులను తీసుకురావాలని ఎమ్మెల్యే సత్యం కోరారు. దీంతో చాలా మంది నోట్‌బుక్స్, పెన్నులను తీసుకువచ్చి ఎమ్మెల్యేకు పుట్టిన రోజు బహుమతిగా అందించారు. వాటన్నింటిని గురువారం కలెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. వీటిని పేద విద్యార్థులకు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీతో మహర్దశ తీసుకువచ్చిందన్నారు. విద్యార్థులు ఆ సౌకర్యాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

## 'మిషన్ భగీరథ' సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



కొత్తపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో రవీందర్

తిమ్మాపూర్, జూన్ 13: మిషన్ భగీరథ సర్వేను ఎటువంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో రవీందర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొత్తపల్లిలో మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందం సభ్యులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి మిషన్ భగీరథ కు సంబంధించిన నల్ల కనెక్షన్ ఉందా, ఉంటే నీళ్లు వస్తున్నాయా, ఎంత మేర వస్తున్నాయి తదితర వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. వివరాలన్నింటిని మిషన్ భగీరథకు సంబంధించిన యాప్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. 20లోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# విత్తనాలు కాపాడుకునేందుకు తిప్పలు

### వర్షాలు లేకపోవడంతో రైతుల ఇబ్బందులు



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో స్ప్రింక్లర్లతో పత్తిని తడుపుతున్న రైతు

హుజూరాబాద్, జూన్ 13: ఒకటి, రెండు వర్షాలు కురవడంతో విత్తనాలు వేసిన రైతులు వాటిని కాపాడుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. పదిరోజుల క్రితం కురిసిన వర్షా లకు రైతులు దుక్కిలు దున్నారు. వర్షాలు పడుతాయనే ఆశతో తొందరపడి పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేశారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో బావుల్లో ఉన్న కొద్దిపాటి నీళ్లతో భూములు తడుపుతున్నారు. గత ఏడాది పత్తి, మొక్కజొన్న రైతులు పంటలు సరిగా పండక ఆర్థికంగా నష్టపోయారు. హుజూరాబాద్ డివిజన్‌లో 25 శాతం మంది రైతులు పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. ఈసారి మే చివరి వారంలో, ఈ నెల మొదటి వారంలో కొద్దిపాటి వర్షాలు కురవడంతో దుక్కిలు దున్ని భూము లు సిద్ధం చేసుకున్నారు. పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటారు. నాటిన నాటి నుంచి వర్షాలు లేకపోవడతో విత్తనాలు భూమిలోనే పొట్లి పోతున్నాయి. దీనిని చూసిన రైతులు వర్షం కోసం మబ్బుల వైపు చూస్తున్నారు. కొంత మంది రైతులు స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులతో నీటిని పారిస్తున్నారు. బావులు, బోర్లలోనూ నీళ్లు ఇంకా చేర లేదు. ఉన్న కొద్ది పాటి నీటితో రైతులు విత్తనాలను దక్కించు కునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు దుక్కి దున్నడానికి, అచ్చు తోలడానికి, పత్తి గింజలు, వాటిని నాటడానికి ఎకరానికి సుమారు నాలుగు వేల రూపాయల వరకు ఖర్చు పెట్టారు. వర్షాలు కురవకపోవడంతో మళ్లీ విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల మూడో వారం నుంచి వర్షాలు కురుస్తాయని, భూమిలో అదును ఉన్నప్పుడే విత్తనాలు పెట్టుకోవాలని సూచించినా రైతులు తొందరపడి విత్తనాలను పెట్టారు. ఇప్పుడు వాటిని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.



సైదాపూర్ మండలం జాగీర్‌పల్లిలో మొక్కజొన్నను తడుపుతున్న రైతు

# ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తు న్నామని, ప్రభుత్వ విద్యను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమే లాసత్పతి కోరారు. గురువారం నగరంలోని హౌజింగ్ బోర్డుకాలనీలో అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేసి సౌకర్యాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులతో పాఠశాలలకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను కల్పించామన్నారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రతి రోజు స్కూల్‌కు రావాలని, చక్కగా చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభు త్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. జూలైలో విద్యార్థులకు షూస్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు, ఎంఈవో మధుసూదనాచారి పాల్గొన్నారు.



హౌసింగ్‌బోర్డుకాలనీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌ను అందజేస్తున్న కలెక్టర్



మంచినీటి కుళాయిలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

### పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

**సుభాష్‌నగర్:** నులి పురుగుల నివారణ కోసం 19 సంవత్సరాలలోపు పిల్లలు, విద్యార్థులందికి ఈనెల 20న ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని అన్నారు. ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించు కుని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులి పురుగుల వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 3,42,323 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాకు 3,48,900 మాత్రలు వచ్చాయన్నారు. తప్పిపోయిన పిల్లలకు 27న తప్పని సరిగా మాత్రలు వేయించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఐవో సాజిదా అత హరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువైరియా, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బీసీడీవో అనిల్ ప్రకాశ్, డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

### 'బీసీ వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలి'

గణేశ్‌నగర్, జూన్ 13: బీసీ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి అదనంగా సీట్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శిపెద్ది శ్రీధర్ రాజు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ గత సంవత్సరం పెంచిన సీట్ల కనుగుణంగా విద్యార్థులకు వసతులు కల్పించలేదని విమర్శించారు. వంద మంది విద్యార్థులు ఉండాల్సిన వసతి గృహంలో 200 మంది విద్యార్థులను చేర్చుకున్నారన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈసారి విద్యార్థులకు వసతులు కల్పించి అదనంగా సీట్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం పక్షాన కోరుతున్నామన్నారు. ఖాళీగా ఉన్న సంరక్షణాధికారులపోస్టులు భర్తీ చేయాలని కోరారు.

### ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులను ఆపాలి

సుభాష్‌నగర్, జూన్ 13: ఆర్‌ఎంపీ, పీఎంపీలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బాధ్యులు తనిఖీల పేరుతో చేస్తున్న దాడులను ఆపాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ అంజనీకుమార్ కోరారు. గురువారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై అసత్య ఆరోపణలు చేస్తూ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య వలంటీర్ వ్యవస్థను తీసుకురావాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద వేణుగోపాల్, కోశాధికారి కొమ్ము గణేష్, ఉమర్ రజా, అహ్మద్ రజ్వి, తాండ్ర మహేందర్, లియాఖత్ అలీ, సదానందం, పార్థసారథి, ప్రభాకర్, శంకర్, వేణు, నాగరాజు పాల్గొన్నారు.

# ఆశాలకు పరీక్ష వద్దు

సుభాష్‌నగర్, జూన్ 13: ఆశా కార్యకర్తలు ఉద్యోగాలకు ప్రవేశ పరీక్ష నిర్వ హించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు లను వెంటనే ఉపసంహరించు కోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 33సంవత్సరాలు, మైదానం ప్రాంతాల్లో 19 సంవత్సరాలుగా పని చేస్తున్నారని తెలిపారు. వారు ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణలు పొందారని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారని తెలిపారు. కరోనా నియంత్రణలో ఆశా వర్కర్ల పాత్ర కీలకమన్నా రు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ప్రవేశ పరీక్ష నిర్వ హించాలని ప్రయత్నిస్తే అందరూ తిరుగు బాటు చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పరీక్ష నిర్వ హించాలని ప్రయ త్నిస్తోందని విమర్శించారు. ఆశా వర్కర్లకు పరీక్ష నిర్వహించడం, బీసీజీ సర్వే విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ యత్నిస్తున్నారన్నారు. ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని, బీసీజీ సర్వే నిలిపి వేయాలని, గతంలో ఇచ్చినట్లు ప్రతి నెల 2న పారి తోషికం చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరెళ్ల శ్రీలత, రంగనవేని శారద, సత్య లక్ష్మి, రజియా, వెంకట లక్ష్మి, సరిత, శంకరమ్మ, శోభ, విజయ లక్ష్మి, పరిమిత, పద్మ, శ్యామల, పద్మ, సదా లక్ష్మి, లక్ష్మి, కవిత, పుష్ప, లత పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

# మోయ తుమ్మెద వాగులో ఇసుక తవ్వకాల నిలిపివేత

తిమ్మాపూర్, జూన్ 13: మండలంలోని కొత్తపల్లి- రేణికుంట గ్రామాల మధ్య ఉన్న మోయతుమ్మెద వాగులో ఇసుక తవ్వకాలను మైనింగ్ అధికారులు నిలిపివేశారు. ఇప్పటికే తీసిన ఇసుకపై ఆడిటింగ్ జరుగుతున్నం దున తవ్వకాలు నిలిపివేసినట్లు తెలిసింది. మోయతుమ్మెద వాగులో 3.86 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరిపేందుకు టీఎస్‌ఎండీసీ ప్రభుత్వం నుంచి మూడేళ్ల క్రితం అనుమతి తీసుకుంది. అనంతరం టెండర్ నిర్వ హించి హైదారాబాద్‌కు చెందిన ఓ సంస్థకు క్వారీని అప్ప జెప్పింది. మూడు రోజుల క్రితం మైనింగ్ అధికారులు క్వారీని పరిశీలించారు. అనంతరం ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీనిపై మైనింగ్ ఏడీ రామాచారిని వివరణ కోరగా ఉన్నతాధికారుల సూచన మేరకు మోయతు మ్మెద వాగులో ఇసుక తవ్వకాలను నిలిపి వేయమని టీఎస్ ఎండీసీకి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఇసుక తవ్వకాలపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుం దని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటామ న్నారు. టీఎస్ ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం మైనింగ్ ఏడీ ఆధ్వర్యంలో అధికారులు వచ్చి క్వారీని పరిశీలించారన్నారు. తిరిగి ఆదేశాలు వచ్చే వరకు ఇసుక తవ్వకాలు గాని, ఇసుక అమ్మకాలు జరపవద్దని ఆదేశించా రని తెలిపారు. మూడు సంవత్సరాలకు 3.86 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తీసేందుకు ప్రభు త్వంతో ఒప్పందం జరిగిందని, ఇప్పటి వరకు 2.76లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించామన్నారు. ఈ సీజన్‌లో మోయతుమ్మెద వాగు నుంచి లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వి స్టాక్ యార్డులో డంప్ చేశామని తెలిపారు. అధికారుల ఆదేశాలతో ఇసుక తవ్వకాలు, తరలింపును నిలిపి వేశామన్నారు. ఆగస్టుతో ఇసుక తవ్వకాలకు సంబంధించిన ఒప్పందం పూర్తవుతుందని తెలిపారు.



డపింగ్ చేసిన మోయతుమ్మెద వాగులోని ఇసుక

## ఓపెన్‌స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 13: తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ నిర్వహించిన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. కరీంనగర్‌లో పదోతరగతి పరీక్షకు 446 మంది విద్యార్థులు హాజరుకాగా 188 మంది ఉత్తీర్ణత సాధించారు. 42.15శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 297 మంది పరీక్షలు రాయగా 265 మంది 89.23శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 383 మంది పరీక్షలకు హాజరుకాగా 130 మంది 33.94శాతం ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో అత్యధికంగా 606 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అత్యల్పంగా 109 మంది కేవలం 17.99శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

● ఇంటర్మీడియట్‌లో జగిత్యాల జిల్లాలో 503 మంది పరీక్షలు రాయగా 188 మంది, 37.38శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 719 మంది పరీక్షలు రాయగా 331 మంది 46.04శాతం, కరీంనగర్‌లో 822 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా వారిలో 480 మంది 58.39శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 553 మంది పరీక్షలు రాయగా 402 మంది, 72.69శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈమేరకు 2023-24 లో నిర్వహించిన పరీక్షలకు హాజరైన వారిలో ఉత్తీర్ణులైన వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూ ల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో విడుదల చేశారు.

## కొనసాగుతున్న విద్యా సంస్థల వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 13: విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా విద్యా సంస్థల వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన తనిఖీలలో మొత్తం 24 వాహణాలను సీజ్ చేసినట్లు డీటీపీ పురుషోత్తం తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని విద్యా సంస్థల బస్సులు 2, ఫిట్‌నెస్, టాక్స్ లేకుండా నడుపుతున్న విద్యా సంస్థల బస్సులు 3, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న విద్యా సంస్థల బస్సులు 4, పన్నులు చెల్లించని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 6, ఫిట్‌నె స్ లేని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 1, ట్రాక్టర్ ట్రాలీకి ట్యాక్స్ చెల్లించకుండా నడుపుతున్న ఒక వాహనాన్ని పట్టుకున్నాట్లు , పట్టుకున్న వాహనాలను సీజ్ చేసి జిల్లా రవాణా కార్యాల యానికి తరలించినట్లు డీటీసీ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రమ మాదాలు చోటు చేసుకోకుండా అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎంవీఐ టి రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, జూన్ 13: ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు చూపకుండా మోసాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేష్ అనే వ్యక్తి 20 సంవత్సరాల క్రితం తిప్పాపూర్ శివారులోని సర్వే నంబర్ 138, 139, 141, 142లో గల 200 గజాల భూమిని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన లెంకల రాజుకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు సరిగా చూపెట్టకుండా ఇబ్బందులకు గురిచేశాడు. అంతే కాకుండా మరల అదే భూమిని సందవేణి ఎల్లవ్వకు గిఫ్ట్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేయించి ఆమెను బెదిరించి సదరు మహిళ వద్ద లక్ష రూపాయలు తీసుకున్నాడు. సరైన హద్దులు చూపించకుండా మోసం చేయగా సందవేణి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

## చేదబావిలో పడిన వృద్ధురాలు

- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


భాగ్యమ్మను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి, జూన్ 13: చొప్పదండి పట్టణంలోని జ్యోతినగర్‌లో గురువారం చేదబావిలో వృద్ధురాలు పడిపోగా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పెంబాల భాగ్యమ్మ (60) గురువారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న చేదబావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది తాళ్లసాయంతో బావిలోకి దిగి వృద్ధురాలిని పైకి తీసుకువచ్చారు. భాగ్యమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది జి రవీందర్, కె శ్రావణ్‌కుమార్, కె సతీష్, వి గంగేశ్ పాల్గొన్నారు.

## నర్సింహస్వామి హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, జూన్ 13 : మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపును గురువారం అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామివారి హుండీలో 4లక్షల 66వేల 35 రూపాయల నగదు భక్తుల నుండి సమకూరినట్లు ఆలయ ఈవో వెంకన్న తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు, దేవాదాయ పరిశీలకులు సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకుమారాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, కార్యాలయ సిబ్బంది, మహేందర్, కొమురయ్య, రమేష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# వ్యాయామ విద్య బలోపేతానికి 'పీసెట్' దోహదం

- శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మల్లేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్13: వ్యాయామ విద్య బలోపేతానికి పీసెట్ నిర్వహణ ఎంతగానో దోహదపడుతుందని శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మల్లేష్ అన్నారు. తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ శారీరక పరీక్షలు గురువారం శాతవాహన యూనివర్సిటీ మైదానంలో ముగిశాయి. మహిళ అభ్యర్థులకు నిర్వహించిన శారీరక సామర్థ్య పరీక్షలను ఆయన జెండా ఊపి మాట్లాడారు. రెండు పర్యాయాలు పీసెట్ నిర్వహణ బాధ్యతలను శాతవాహన యూనివర్సిటీ నిర్వహించడంతో న్యాక్ గ్రేడ్‌కు అర్హత సాధించే అవకాశం ఉందన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లపైనే ఉంటుందన్నారు. చివరి రోజు మొత్తం 345మంది మహిళ అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 253మంది బీపీఈడీ అభ్యర్థులు కాగా 102మంది డీపీఈడీ అభ్యర్థులు. వీరికి 100మీటర్లు, 400మీటర్లు షాట్‌పుట్ ,హైజంప్, లాంగ్‌జంప్‌లతో పాటు 8క్రీడా అంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, టీజీ పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగం డైరెక్టర్ ఆచార్య జెప్రభాకర్ రావు, శాతవాహన విశ్వవిద్యాలయం స్పోర్ట్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునవర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్‌లు విజయ్‌కుమార్, బాలరాజు, శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, గద్దె సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాతవాహన మాజీ వీసీ మల్లేష్

## ప్రమాదవశాత్తు బోర్డు పైన పడి పారిశుధ్య కార్మికుడి మృతి

ధర్మారం, జూన్ 13: ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎల్తూరి సత్తయ్య(50) అనే పారిశుధ్య కార్మికుడు గురువారం చదును చేస్తున్న క్రమంలో పైన గల బోర్డు ప్రమాదవశాత్తు పడడంతో మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల వాటర్ ట్యాంక్ కింది భాగం ఆవరణలో గల చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ కార్మికుడు సత్తయ్య తొలగిస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్ యొక్క వాటర్ లెవల్ చూపే బోర్డు పై నుంచి సత్తయ్యపై పడింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ భుజం వెనుక తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తయ్య భార్య శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మికులు కోరారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన దళిత యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు..

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, జూన్ 13: వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో గురువారం తెల్లవారు జామున నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగిరి గ్రామానికి చెందిన జవ్వాజి ఎల్లయ్య (55) అనే వ్యక్తి గురువారం తెల్లవారు జామున సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటు వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

- 34 మందిపై కేసు

కరీంనగర్ క్రైం, జూన్ 13: అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న సమాచారం మేరకు గురువారం కరీంనగర్ రూరల్ పోలీస్ సబ్ డివిజన్ పోలీసులు దాడులు నిర్వహించి 34 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. కరీంనగర్ శివారులోని అలుగునూర్, తిమ్మాపూర్ మండలం రేణికుంటల వద్ద పోలీసులు నిర్వహిచి ప్రత్యేక తనిఖీలలో ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని మానకొండూర్, ఎల్ఎండీ పోలీసు ఠాణాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేశామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు గోనెల సంపత్, బొంగోని రాజు, ఇరుగదిండ్ల సమ్మరాజు, సారయ్య, బోయిని అనిల్‌రాజు, పల్లపు ఎల్లయ్య, మార్క అభిషేక్, జితెందర్, వెంకటస్వామి, రాజేశ్వరి, అజయ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రమేశ్, సంపత్, ప్రణయ్‌వంశీ, అనిల్, అంజయ్య, రాజు, వెంకటేష్, రాజశేఖర్, హరితేజ, ఎల్లయ్య, గణేష్, అనిల్, కుమార్, రమేష్, రవి, ఎండీ అజీమ్, రమేశ్, రాజశేఖర్, జంపయ్యలపై ఐపీసీ సెక్షన్ 379, 21(4) మైన్స్ అండ్ మినరల్స్ యాక్టుతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట గ్రామ సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను గురువారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

# మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు


మాట్లాడుతున్న టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం, జూన్ 13: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. నగరంలో గురువారం వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకొని 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. పట్టుబడిన వాహనాలను ట్రాఫిక్ ఠాణాకు తరలించామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే సంబంధిత వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని కరీంనగర్ టౌన్ ఏసీపీ హెచ్చరించారు. కరీంనగర్‌లో బుధవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు గురువారం టౌన్ ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు వాహన యజమానులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ఖరీముల్లా ఖాన్, స్వామి, ఎస్ఐలు ఇషాక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పుల మృతి


దుప్పులకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, జూన్ 13: వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పులు మృతి చెందాయి. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో ఉండే అటవీ ప్రాంతం నుంచి తాగునీటి దాహార్తి తీర్చుకొనేందుకు రెండు చుక్కల దుప్పులు వచ్చాయి. దుప్పుల రాకను గుర్తించిన కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గాయపడిన దుప్పులను గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించటంతో వాటిని స్వాధీనం చేసుకొని వైద్యం కోసం అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. పశు వైద్యాధికారులు చికిత్స అందించినప్పటికీ కోలుకోలేక రెండు దుప్పులు మృతి చెందాయి. దాంతో అటవీ సెక్షన్ అధికారికి పద్మలత ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించి అటవీ ప్రాంతంలో కాల్చివేశారు

## విద్యుదాఘాతంతో గేదె మృతి

ధర్మపురి, జూన్ 13: దమ్మన్నపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గురువారం ఉదయం రైతు మడిపల్లి తిరుపతి తన గేదెను మేపడం కోసం సమీపంలో గల గోదావరి నది వద్దకు తీసుక వెళ్లాడు. గేదె గడ్డి మేస్తుండగా పొలం కోసం అమర్చిన విద్యుత్ మోటార్ వైరు తాకి షాక్ తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ 70,000 విలువ ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు తిరుపతి కోరారు.

## గుండెపోటుతో కూలీ మృతి

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని పొత్తూర్ గ్రామసమీపంలోని మానేరువాగులో కూలీపనికి వెళ్ళిన చెక్కిళ్ళ శ్రీనివాస్ (50) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రాజు(ఫైల్)

వీర్నపల్లి, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిపదిర గ్రామానికి చెందిన వేముల రాజు(40) బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి కోనరావుపేట గ్రామశివారులో ద్విచక్ర వాహనంతో చెట్టును బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్సులో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పిడుగుపాటుకు ఆవు మృతి

మానకొండూర్, జూన్ 13: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన బండి అశోక్‌కు చెందిన ఆవు గురువారం పిడుగుపాటుతో మృతి చెందింది. గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

# 96 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, జూన్ 13: జిల్లాలో గురువారం పౌర సరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన తనిఖీలలో 96 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం నిల్వలు పటుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లి రేషన్ దుకాణాలను, ఐతరాజుపల్లి ఓపెన్ ఏరియా పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలోని రేషన్ షాపు తనిఖీచేసినప్పుడు 52.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎక్కువగా రేషన్ షాప్ నిల్వలలో గుర్తించామని అన్నారు. అదేవిధంగా సుల్తానాబాద్ మండలం ఐతారాజుపల్లి వద్ద ఓపెన్ ఏరియాలో 43.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని డీసీఎస్‌వో హెచ్చరించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.


ఐతరాజ్‌పల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

# ప్రమాదకరంగా గుంత

- మరమ్మతులు చేయని అధికారులు
- రాకపోకలకు ప్రజల అవస్థలు

మల్లాపూర్, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు పైపు మరమ్మతుల కోసం పది రోజుల క్రితం గుంత తవ్వారు. పనులు పూర్తి చేసుకున్నాక గుంతను మాత్రం అలానే ఉంచి వెళ్లారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వేలువెత్తున్నా యి. అదే గుంతలో గ్రామానికి చెందిన బింగి మనస్విత్ అను బాలుడు గురువారం ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో బాలుడి తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రతి నిత్యం ఆ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిల్లో ఆ రోడ్డుపై తెలియని వారు వేళితే ఏలాంటి ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు స్పదించి గుంతను పుడ్చాల్సిన అవసరం ఉదని కాలనీ వాసులు వాపోతున్నారు.


రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

## మంత్రిపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

**-కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్**

సుభాష్‌నగర్, జూన్13: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే చట్టాన్ని ఆశ్రయిస్తామని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కౌశిక్‌రెడ్డి కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కమీషన్లు తీసుకునే సంస్కృతి టీఆర్ఎస్ పార్టీదని ఆరోపించారు. దళితబంధు పథకంలో కమీషన్‌లు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఒప్పుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బ్లాక్‌మెయిల్ చేసి పబ్బం గడుపుకునేది ఆయనే అని విమర్శించారు. నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని లేకుంటే ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

ఈసమావేశంలో రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, జిల్లా కన్వీనర్‌లు జిడి రమేష్ ,అస్తపురం తిరుపతి, మీసాల సాయిలు, మెరుగు సంపత్, దుబ్బాసి కుమార్, కాడ శంకర్, మేడి అంజయ్య, దండి రవీందర్, కనకయ్య, దీకొండ శేఖర్‌బాబు, అస్తపురం రమేష్, తిరుమల, లింగపల్లి లక్ష్మణ్, గాలిపెల్లి రవీందర్, తంగెళ్ళ కిరణ్ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

కరీంనగర్ రూరల్, జూన్ 13: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో గురువారం కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలకు చెందిన బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో జిరమేష్, దాడి సుధాకర్, రాంగోపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, రాజేందర్, బి మహేష్, శేఖర్, పి రాజు తదితరులు పాల్గొన్నారు.

● చిగురుమామిడి, జూన్ 13 కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజ య్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్ట డంతో ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రేపు వికాస తరంగిణి సమావేశం

కరీంనగర్ కల్చరల్, జూన్ 13: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, తదితర కార్యక్రమాల గురించి చర్చించేందుకు శనివారం సాయంత్రం 5 గంటలకు ఆండాళ్ భవనంలో వికాస తరంగిణి ఏడుగురు సభ్యులు, బాధ్యులు హాజరు కావాలని జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## మార్కెట్‌లోకి అర్బన్ క్రూజర్ టైజర్ కారు విడుదల




కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న డీటీసీ పురుషోత్తం

కరీంనగర్ అర్బన్, జూన్ 13 : టయోటా కంపెనీకి చెందిన నూతన వాహనం అర్బన్ క్రూజర్ టైజర్‌ను కరీంనగర్‌లోని టయోటా షోరూంలో గురువారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) పురుషోత్తం కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ సరిలాల్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వాహన కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ దీని ప్రారంభ ధర 7,73500 నుంచి 12,87,000 వరకు ఉంటుందని తెలిపారు. 22.8 కిలోమీటర్ పర్ లీటర్ మైలేజ్ ఇస్తుందని తెలిపారు. ఈ నూతన వాహనం వివిధ ఫైనాన్స్ కంపెనీల ద్వారా అతి తక్కువ డౌన్‌పేమెంట్, తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

## 'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు'

హుజూరాబాద్, జూన్ 13: కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీపీసీ బూడిద స్కామ్ పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కనుసన్నల్లోనే జరుగుతుందని వారం రోజుల క్రితం ఆధారాలతో చెప్పారని గుర్తు చేశారు. ఆయినప్పటికీ ఇప్పటి వరకు మంత్రి స్పందించడం లేదని విమర్శించారు. సమావేశంలో సురేందర్‌రెడి ప్రతాప్‌రెడ్డి, నరేష్, యాదవ్, అశోక్, ఎల్లయ్య, తిరుపతి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## సంఘాన్ని బలోపేతం చేస్తాం

శంకరపట్నం, జూన్ 13: బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేస్తామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో సంఘం రాష్ట్ర స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన జక్కని సంజయ్‌కుమార్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకటిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ అరుణ్ కుమార్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 19న వారసంతకు వేలం

శంకరపట్నం, జూన్ 13: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే వారసంతకు ఈ నెల 19న వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామప్రత్యేకాధికారి, ఎంపీడీవో నల్ల శ్రీవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనాలను కునేవారు 19న ఉదయం 11గంటల వరకు కేశవపట్నం గ్రామపంచాయతీ వద్దకు రావాలని కోరారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ



విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ రాణి

హుజూరాబాద్‌రూరల్, జూన్ 13: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ఎంపీపీ రాణి ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనురాధ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వీవో రాజు, సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాట్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీటీసీ రావుల అనిత-వెంకట్ ఏకరూప దుస్తులు అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



కార్పొరేటర్లతో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ టౌన్, జూన్ 13: అసెంబ్లీ ఎన్నికల నుంచి నగరంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయని, ఎన్నికల కోడ్ తొలగించినందున అభి వృద్ధిపై దృష్టి పెట్టి పనులు పూర్తయ్యేలా చూడా లని నగరపాలక సంస్థ కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కాంగ్రెస్ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ళప్రసాద్, మెండి శ్రీలత చంద్రశేఖర్, నాయకులు పిట్టల శ్రీనివాస్, వైద్యుల అంజన్‌కుమార్ హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి నగర సమస్యలు, అభివృద్ధి పనుల వివరాలను వివరించారు. ప్రధానంగా గత బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలిపెట్టిన స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు, సీఎం హామీ నిధుల పనులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్లు, డ్రైనేజీలను తవ్వి వదిలిపెట్టడంతో వర్షాలు పడితే అందులో నీరు నిలిచి కనీసం నడిచేందుకు కూడా వీలుండదన్నారు. ఆ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులతో సమీక్ష నిర్వహించి ఆదేశాలివ్వాలని కోరారు. అలాగే సీఎం హామీ నిధులు ఇప్పించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించ లేదన్నారు. అంచనాలు ఎక్కువగా చేసి బిల్లులు డ్రా చేశారనే అనేక ఆరోపణలు, ఫిర్యాదులున్నందున వాటిపై కూడా దృష్టిసారించి విచారణ జరిపించాలని వారు కోరారు.

**● మంత్రి 'పొన్నం'కు**

**ఎల్ఎండీ ముంపు బాధితుల మొర**

దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ) నిర్మాణంలో మా భూములు, ఇళ్ళు కోల్పోయామని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ముంపు బాధితులకు ఉద్యోగాలు, స్థలాల విలువను బట్టి డబ్బులు, ఇవ్వడమే కాకుండా పునరావసం కల్పిస్తామని ఆనాటి ప్రభుత్వం చెప్పిందని ఎల్ఎండి ముంపుబాధితులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించారు. గురువారం కరీం నగర్ నుంచి ముంపు బాధితులు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ళపల్లి సంతోష్‌గౌడ్, కందుల శ్రావణ్ గౌడ్, ఎం.డి.మజహర్ అలీ, ఎం.శ్రీకాంత్ హైదరాబాద్ సెక్రటే రియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముంపు బాధితులకు ఉద్యోగాలివ్వక పోవడంతో తీవ్రంగా నష్టపోయామని, న్యాయం చేయాలని కోరారు.

## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

సుభాష్‌నగర్, జూన్ 13: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గూడ కనకయ్య కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్గునూరులో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, కాని అధికారులు మాత్రం అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

మానకొండూరు మండలం సదాశివపల్లి గ్రామంలో ప్రభుత్వ శిఖం భూమి అన్యాక్రాంతం అవుతుందని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదన్నారు. సులభ్ కాంప్లెక్స్ మంజూరు అయిందని నిర్మాణం చేపట్టలేదన్నారు. అల్గునూరులో బస్టాండ్ ఉన్నచోట బస్సులు ఆపడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణలు ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, జూన్ 13: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ నుంచి బూడిద లారీలు ఇతర ప్రాంతాలకు వెళుతున్నాయని, వాటిలో మంత్రి పొన్నం ప్రభాకర్ హస్తం ఉందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ లారీలు హుజూరాబాద్ గుండా వెళ్తున్నాయని, అందుకు ఎమ్మెల్యే అడిగిన కమీషన్ ఇవ్వనందునే అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీసాల సాయిలు, గోష్కి శంకర్, జిల్లా మహిళ అధ్యక్షురాలు ఆవారు లత, మామిడిపల్లి కృష్ణ, గండి గణేష్, రాంరెడ్డి, ఆదేపల్లి ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పదోన్నతుల్లో రిజర్వేషన్లు పాటించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 17: రాష్ట్ర విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ రోస్టర్ పాయింట్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ కోరారు. అన్ని కేటగిరి పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరుగాలని, సీనియార్టీ జాబితాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందించగా కార్యక్రమంలో బలరాం, రాజన్న, ఐలన్న, స్వరాన్‌సింగ్, సురేశ్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ భూములను పరిరక్షించాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 13: నగర పాలక సంస్థ పరిధిలో రేకుర్తిలో గల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పరిరక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దుర్గం మారుతి ప్రభుత్వాన్ని కోరారు. రేకుర్తిలోని సర్వేనెంబర్ 175, 172, 137 ఎరుకల గుట్ట వద్ద ఉన్న విలువైన ప్రభుత్వ భూములను ఎలాంటి అనుమతులు లేకుండా కబ్జా చేస్తున్నారని విమర్శించారు. రేకుర్తిలో ఎంతో మంది ఇళ్ళు లేని నిరుపేదలు, రెక్కాడితేకానీ డొక్కాడని కూలీలు, ఇళ్ళు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఇళ్ళులేని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకునేందుకు భూమి కేటాయించి, ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ భూమి స్వాధీనం

**- బొమ్మకల్‌లో హద్దులు పాతిన అధికారులు**




ప్రభుత్వ స్థలానికి హద్దులు పాతుతున్న రెవెన్యూ అధికారులు

కరీంనగర్ రూరల్, జూన్13: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ పరిధిలో గల ప్రభుత్వ భూమిని అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సర్వేనెంబర్ 593లో 21గుంటల భూమి, 604సర్వేనెంబర్‌లోని 15గుంటల భూమిలో కబ్జా చేశారని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా గురువారం ఆయా సర్వేనెంబర్‌లో సర్వే చేశారు. అనంతరం కబ్జాకు గురైన భూమిలో హద్దులు పాతారు. ఆర్ఐ వాస్తవ్, సర్వేయర్ సంతోష్‌లు సర్వే చేపట్టి హద్దురాళ్ళను ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో భూమి అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. గ్రామానికి చెందిన యునైటెడ్ ఫోరం ఫర్ రైట్ ఇన్‌ఫర్‌మేషన్ యాక్ట్ కన్వీనర్ దొమ్మటి బాబు, అసిరి తిరుపతి గ్రామస్థుల సమక్షంలో ఈసర్వే చేపట్టారు.

## అరబిందో సొసైటీల సమావేశానికి కలెక్టర్‌కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, జూన్ 13: అరబిందో సొసైటీల తెలంగాణ ప్రాంతీయ సాధనా శిబిరం ఈనెల 15, 16 తేదీల్లో ఫిల్మ్‌భవన్‌లో జరుగనుండగా ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా రావాల్సిందిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఆహ్వానపత్రం గురువారం అందజేశారు. హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, గడ్డిపల్లి, సిద్దిపేట, గజ్వేల్, వేల్పూరు కేంద్రాలకు చెందిన సొసైటీల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులంతా హాజరౌతున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. అరవిందుల అపార కృప పొందడానికి, అరబిందో దర్శనం, పూర్ణ యోగం, ధ్యాన మార్గం వంటి అంశాల అవగాహనకు ఈ శిబిరం ఓ లక్ష్య సాధనా కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. 15న ఉదయం 9 గంటల నుంచి 11-30 గంటల వరకు ప్రారంభ సమావేశం ఫిల్మ్‌భవన్‌లో ఉంటుందని, నగరవాసులు హాజరు కావాలని కోరారు.

కలెక్టర్ పమేలా సత్పతికి ఆహ్వాన పత్రం అందించిన వారిలో సొసైటీ అధ్యక్షుడు కోల అన్నారెడ్డి, సభ్యులు వుప్పల రామేశం, సబ్బని లక్ష్మీనారాయణ, బొజ్జ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రసాభాసగా మండల సర్వ సభ్య సమావేశం

**- సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు**




మాట్లాడుతున్న ఎంపీపీ కొత్తవినీత

చిగురుమామిడి, జూన్ 13: మండల కేంద్రంలో ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. అభివృద్ధి పనులు ఆలస్యంగా కొనసాగుతున్నాయని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. ఏడాది క్రితం మండలంలోని ఇందుర్తి - గాగిరెడ్డిపల్లి గ్రామానికి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారని, పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదని ఇందుర్తి- 2 ఎంపీటీసీ సభ్యురాలు అందె స్వప్న నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆమెకు పలువురు సభ్యులు మద్దతు తెలిపారు. పలు గ్రామాల్లో రోడ్లు సరిగా లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారుల తీరుపై కలెక్టరుకు పిర్యాదు చేస్తామని తెలిపారు. దీంతో సభ్యులు ఆందోళన విరమింప చేసినారు. చిన్నముల్కనూర్‌లో విద్యుత్ సమస్యలు పేరుకుపోయాయని ఎంపీటీసీ పెనరి జమున అన్నారు. బొమ్మనపల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పాఠశాలలో పూర్తి స్థాయి సిబ్బంది లేక ఇబ్బందులు ఉన్నాయని గ్రామ ఎంపీటీసీ, మండల ఎంపీటీసీల ఫోరం అధక్షుడు మిట్టపల్లి మల్లేశం ప్రస్తావించారు. వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగులో మెలకువలు, విత్తనాల వినియోగంపై అవగహన కల్పించాలని మూదిమాణిక్యం ఎంపీటీసీ ఏలేటి రవీందర్‌రెడ్డి కోరారు. అర్హులైన లబ్ధిరులకు రేషన్ కార్డులు అందించాలని వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, ఎంపీడీవో బి మధుసూదన్, ఎంపీటీసీలు మెడబోయిన తిరుపతి, సంధ్య , మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు మేలైన విత్తనాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ఏడీ రామారావు

చొప్పదండి, జూన్ 13: రైతులు మేలైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ రామారావు అన్నారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్‌లో గురువారం సాగుకు సన్నద్ధం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటలకు ఎరువులను మోతాదుకు మించి వాడవద్దని, సేంద్రియ ఎరువులను వినియోగించాలని చెప్పారు. అం తర పంటలను సాగు చేయాలని, పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, ఎంపీ టీసీ బత్తుల లక్ష్మీనారాయణ, ఏవో వంశీకృష్ణ, ఏఈవో సాయిప్రసన్న పాల్గొన్నారు.

## లాసెట్ ఫలితాల్లో ఎస్సైకి 61వ ర్యాంకు

కరీంనగర్ క్రైం, జూన్13: లాసెట్-2024 ఫలితాల్లో ఎస్సై నందిరెడ్డి నరేష్‌రెడ్డి 61వ ర్యాంకు సాధించారు. నరేష్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ కమిషనరేట్‌లో సీసీఆర్‌బీ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

హుజూరాబాద్, జూన్ 13: హుజూరాబాద్ 33/11 సబ్ స్టేషన్ కార్యాలయంలో శనివారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నామని డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ హెచ్‌తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం, అదనపు లోడు, క్రమబద్ధీరణ, సర్వీసు పేర్లు మార్చుకోవడం, బిల్లులు సంబంధించిన వాటిపై చర్చిస్తామని పేర్కొన్నారు. హుజూరాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ కేఎన్ గుప్తా, సభ్యుడు చరణ్‌దాస్ హాజరవుతారని తెలిపారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న యాదవ కులస్తులు

గన్నేరువరం, జూన్ 13: మండల కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యాద వ కులస్థులు ఇంటికో బోనంతో మహిళలంతా నెత్తిన బోనాలను ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

## పచ్చునూర్‌లో పెద్దమ్మ బోనాలు

మానకొండూర్, జూన్ 13: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో గురువారం పెద్దమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ముదిరాజు కులస్థుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మహిళలు డప్పు చప్పుళ్ళ మధ్య పెద్దమ్మ బోనాలతో నృత్యాలు చేస్తు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఇంగ్లీష్ టీచర్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, జూన్ 13: కొత్తపల్లి మండలం ఎలగందల్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా టీచర్ పోస్ట్ భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ టీచర్ పోస్టుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో శనివారం డెమోకు పాఠశాలకు హాజరు కావాలన్నారు. బీఈడీ, ఎంఏ ఇంగ్లీష్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

## బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 13: బక్రీద్ పండుగకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్ ఒక ప్రకటనలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిఆర్‌ఓ పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశా మని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలు, 17మండలాల పరిధిలోని కబ్రస్తాన్, ఈద్గా, మజీద్‌లలో పరిశుభ్రత కోసం శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, వాటర్, కుర్బానీ జీవాల కళేబరాల తరలింపుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. నమాజ్ సమయాల్లో రాత్రి వేళల్లో బందోబస్తును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నియామకం

కరీంనగర్ అర్బన్, జూన్ 13: నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా మహమ్మద్ అత్తి సోహెల్, 4వ డివిజన్ అధ్యక్షులుగా ఎస్‌కె ఉస్మాన్ పాషా, 52వ డివిజన్ అధ్యక్షులుగా ఎండి ఖాజ ఖలీల్ ఉద్దీన్ లను నియమిస్తూ నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాల యంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సంద ర్భంగా నూతనంగా నియామకమైన వారు మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మానకొం డూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెతిపారు.

## నేడు ఆంబోతుల వేలం

భగత్‌నగర్, జూన్ 13: తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఘనీకృత ఆంబోతుల వీర్యసేకరణ కేంద్రం పద్మనగర్‌లో శుక్రవారం ఆంబోతుల వేలం నిర్వహించనున్నట్లు పశు సంవర్ధన శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎం బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఘనీకృత ఆంబోతుల వీర్య సేకరణ కేంద్రం పద్మనగర్ ఆదీనంలో గల 2 సిబిహెచ్ఎఫ్, 1 సాహివాల్, 1 మెహసాన, 8 ముర్ర జాతి ఆంబోతులను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల రైతులు దరావత్తు రూ.20 వేలు చెల్లించి రశీదు పొంది వేలంలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9700275861 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కరీంనగర్ టౌన్, జూన్ 13: రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ 2024-25 సంవత్సర నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షులుగా వేల్పుల శశికళ, కార్యదర్శిగా నరహరి లక్ష్మారెడ్డి, కోశాధికారిగా చందుపట్ల ఉమ, కార్యవర్గసభ్యులతో మొదటి ఉప గవర్నర్ సింహం రాజు కోదండరాం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి రాళ్ళబండి శంకరప్రసాద్‌రెడ్డి, రెండవ ఉప గవర్నర్ మోరు భద్రేశం, ఊకంటి సంపతికుమారి, బోయనపల్లి సరళ, సత్యనారాయణ రావు, సుధీర్‌రావు, కె.రాజేందర్‌రెడ్డి, కెప్టెన్ మధుసూధన్‌రెడ్డి, శేఖర్‌రావు, కార్యవర్గసభ్యులు వందనసింగ్, మూల రవీందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## నాన్ టీచింగ్ సిబ్బంది ధర్నా

సుభాష్‌నగర్, జూన్13: తమ ఉద్యోగాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ నాన్‌టీచింగ్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమను కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. 11నెలల వేతనం ఇస్తూ 42రోజులు టర్మినేట్ చేస్తున్నారని వాపోయారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను అవుట్‌సోర్సింగ్ పద్ధతిని రద్దు చేస్తున్నామని ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడని ఆరోపించారు. గతంలో మాదిరిగా జీతాలను తమ ఖాతాల్లో జమ చేయాలని వారు కోరారు.


## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

ఇల్లందకుంట, జూన్ 13: హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైన సజ్జద్ మహ్మద్‌ను గురువారం మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి రామనాథం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో దిలీప్, అనిల్, రాజమౌళి, సుధీర్, వేణు, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

## 10జీపీఏ సాధించిన విద్యార్థినికి..

చిగురుమామిడి, జూన్ 13: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని దాసరి శ్రీవైష్ణవ్య 10 జీపీఏ సాధించడంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, పిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ సన్మానించినారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొన్న పాఠశాల బస్సు



చెట్టును ఢీకొట్టిన బస్సు

రామడుగు, జూన్ 13: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ శివారులో గురువారం ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి అదుపు తప్పిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు చెట్టుకు ఢీకొట్టింది. గోపాల్‌రావుపేట గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన టీచర్లను తరలించే బస్సు కరీంనగర్‌కు వైపు వెళుతోంది. దేశ్‌రాజ్‌పల్లి గ్రామ శివారు నుంచి వెళుతుండగా వర్షం పడింది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టును ఢీకొంది. బస్సులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

## బాధిత కుటుంబానికి చేయూత

గంగాధర్, జూన్ 13: దుబాయిలో బ్రెయిన్‌డెడ్‌కు గురై మరణించిన వ్యక్తి కుటుంబానికి గంగాధర లయన్స్‌క్లబ్ వారు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గంగాధర మండలం ఉప్పర మల్యాలకు చెందిన సందగిరి రమేశ్ దుబాయిలో మరణించాడు. విషయం తెలుసుకొని క్లబ్ అధ్యక్షుడు దూలం కళ్యాణ్, క్లబ్ సభ్యులు అందరు కలిసి రూ. 20వేలు, సోషల్‌మీడియా ద్వారా లక్షా 50వేలు సమకూర్చి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలోఅధ్యక్షుడు దూలం కళ్యాణ్, ప్రధానకార్యదర్శి శ్రీరాం శ్రవణ్, కోశాధికారి అల్లా విజేందర్‌రెడ్డి, పర్రెం లక్ష్మారెడ్డి, పోలు సమ్మయ్య, వేముల మల్లేశం, గండవేణి రాజు, కర్రె బాపురెడ్డి, మోతె నర్సింహారెడ్డి, సుద్దాల రవీందర్‌రెడ్డి, ముద్దం నగేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.